సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 27 । జూన్ । 2023



జెన్‌కో సీఎండీ పర్యటన

కుమ్మరిగూడెంలో నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ బ్యారేజీని, మణుగూరు బీటీపీఎస్‌ను జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు సందర్శించారు. 10లో



'అటవీ' దొంగలు?

అడవులను రక్షించాల్సిన సిబ్బందిలో కొందరు ఇంటిదొంగలుగా మారుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఎండ ప్రభావం అంతగా కనిపించదు. అక్కడక్కడా జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామి వారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

ప్రధానార్చకులకు ఇక పర్యవేక్షణ విధులే..!

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రధానార్చకులు ఇక నుంచి పర్యవేక్షణ విధులు మాత్రమే నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈఓ రమాదేవి ఉత్తర్వులు విడుదల చేశారు. గతంలో ప్రధాన అర్చకులు పర్యవేక్షణతో పాటుగా పూజాది విధులను నిర్వర్తించేవారు. తాజా ఉత్తర్వుల ప్రకారం వారు ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాలు, ఇతర అర్చకుల విధులను పర్యవేక్షించాల్సి ఉంటుంది. అయితే పూజలలో వారి ఇష్టానుసారం పాల్గొనే అవకాశాన్ని ఈఓ కల్పించారు. కాగా ఈ ఉత్తర్వులు ప్రస్తుతం ప్రధాన అర్చకులుగా పనిచేస్తున్న పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్‌కు వర్తిస్తాయి.

నేడు 'నిధి ఆప్ కే నిఖత్'

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం 'నిధి ఆప్ కే నిఖత్' నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.డీ.సలీంఖాన్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని సంస్థల యజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లు తమ సమస్యలను భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్) ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో తెలిపి పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వాసులు మధిర మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో, భద్రాద్రి జిల్లా వాసులు మణుగూరులోని మున్సిపల్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న జెన్‌కో డైరెక్టర్

పాల్వంచరూరల్ : మండలంలో వేంచేసి ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారిని జెన్‌కో థర్మల్ డైరెక్టర్ బి.లక్ష్మయ్య దంపతులు సోమవారం దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారి సన్నిధిలో వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కేటీపీఎస్ డీఈలు సురేష్, రాందాస్, ఏడీఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

నవీన్‌మిట్టల్‌తో ఎమ్మెల్యే వనమా భేటీ



నవీన్ మిట్టల్‌తో వనమా వెంకటేశ్వరరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సిసిఎల్‌ఏ నవీన్ మిట్టల్‌తో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సోమవారం భేటీ అయ్యారు. కొత్తగూడెంలోని ఎస్ఆర్‌టీ కాలనీ, వనమా నగర్, మాయాబజార్, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయమై ఆయనతో చర్చించారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని నవీన్‌మిట్టల్ హామీ ఇచ్చారని వనమా తెలిపారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు జాతీయ పురస్కారం

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లుకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మద్దిశెట్టి వెంకటేశ్వరరావు తెలుగు వెలుగు జాతీయ పురస్కారం అందుకున్నారు. విద్యారంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గాను తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఏపీలోని గుంటూరు పోలేరమ్మ తల్లి ఆలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వరరావుకు పురస్కారం అందజేశారు.

అటకెక్కిన అభయం

వరద భయం గుప్పిట్లో భద్రాద్రి ఏజెన్సీ

- లోతట్టు ప్రాంత ప్రజల్లో మొదలైన దిగులు
- అమలుకు నోచని సీఎం కేసీఆర్ హామీలు



వరద సహాయ శిబిరంలో ముంపు బాధితులను పరామర్శిస్తున్న సీఎం కేసీఆర్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దేశమంతటా నైరుతి రుతుపవనాలు విస్తరిస్తున్నాయి. ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నాయి. కానీ గోదావరి వరదల నుంచి భద్రాద్రి ఏజెన్సీకి అభయం ఇప్పటికీ దక్కలేదు. గతేడాది వచ్చిన రికార్డు స్థాయి వరదల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలో ఏ ఒక్కటీ ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదు. వానాకాలం వచ్చిందంటే చాలు.. జిల్లాలో గోదావరి ఏజెన్సీ వణికిపోతోంది. ఉరకలెత్తే గోదావరి, దాంతో పాటే వచ్చే వరద కారణంగా తీరం వెంబడి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అవుతున్నాయి. వరద వచ్చిందంటే రాత్రీ పగలు తేడా లేకుండా పెట్టే బేడా సర్దుకుని పిల్లాపాపలతో ఎత్తయిన ప్రాంతాలకు తరలిపోవాల్సి వస్తోంది. వరదల కారణంగా పదుల సంఖ్యలో ఏజెన్సీ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ సమస్యలన్నింటికీ చరమగీతం పాడుతామని గతేడాది వచ్చిన వరదల సందర్భంగా సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. అయితే ఇందులో ఏ ఒక్క హామీ ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. 90 శాతం ప్రతిపాదనలు కాగితాల దశను కూడా దాటలేదు.

నీట మునిగిన వందలాది గ్రామాలు..

గతేడాది జూలైలో గోదావరి పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన క్లౌడ్ బరస్ట్ కారణంగా గోదావరికి రికార్డు స్థాయిలో వరద వచ్చింది. 70 అడుగుల ఎత్తులో నీటి ప్రవాహం రెండు రోజుల పాటు కొనసాగింది. దీంతో చర్ల, దుమ్ముగూడెం, అశ్వాపురం, బూర్గంపాడు, భద్రాచలం మండలాల పరిధిలో వందలాది గ్రామాలు మునకకు గురయ్యాయి. సుమారు 27 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వచ్చింది. అనేక గ్రామాలకు వారం రోజులు పాటు రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం పట్టణానికి రక్షణగా ఉన్న కరకట్ట సైతం కాపాడలేని పరిస్థితులు ఎదురయ్యాయి. ఏపీలో ఉన్న యటపాక వద్ద కరకట్టపై నుంచి రెండు మూడు గంటల పాటు వరదనీరు ప్రవహించింది. ఇదే పరిస్థితి మరొక పూట కొనసాగి ఉంటే భద్రాచలం మొత్తం జలదిగ్బంధంలో చిక్కుకునేది. వరదలో పరిస్థితి విషమించడంతో సహాయక చర్యల కోసం ఆర్మీని సైతం రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దింపింది. సీఎం కేసీఆర్ స్వయంగా భద్రాద్రికి వచ్చి పరిస్థితులు పరిశీలించారు. వరదల నుంచి భద్రాద్రికి అభయం ఇస్తూ అనేక హామీలు గుప్పించారు.

- భద్రాచలంలో వరద ముంపునకు గురయ్యే సుభాష్‌కాలనీ, రెవెన్యూ కాలనీ, కొత్త కాలనీ తదితర లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలకు ఎత్తయిన ప్రాంతంలో పక్కా ఇళ్లు నిర్మిస్తామన్నారు. ఇందు కోసం సింగరేణి నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ఏడాది గడిచినా ఈ ప్రతిపాదనలు కాగితాల్లోనే మగ్గిపోతున్నాయి.
- 500 ఏళ్ల వరద రికార్డులను పరిశీలించి కరకట్టను కొత్తగా నిర్మిస్తామన్నారు. అంత వరకు ముంపునకు కారణం అవుతున్న యటపాక, సుభాష్‌నగర్ వైపు కరకట్టను కొత్తగా నిర్మిస్తామని ప్రకటించారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వంతో మాట్లాడుతామని అన్నారు. కానీ ఈ దిశగా పెద్దగా ప్రయత్నాలు జరగలేదు. ఏపీలో ఉన్న ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలంటూ మంత్రి అజయ్ ఒకసారి అసెంబ్లీలో ప్రస్తావించారు. ఇక 500 ఏళ్ల వరదపై అధ్యయనం ఇంకా కొనసా..గుతూనే ఉంది.
- వరదలు రాకమునుపే ముందు జాగ్రత్తగా దుమ్ముగూడెం, చర్ల, అశ్వాపురం, బూర్గంపాడు మండలాల పరిధిలో ఉన్న రేషన్ షాపులు, ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలకు అదనంగా సరుకులు సరఫరా చేసి బఫర్ స్టాక్‌ను సిద్ధం చేయాలి. ఈ ఏడాది జూన్ చివరికి చేరుకున్నా ఈ పనుల్లో వేగం పెరగలేదు. ఇప్పటికీ రెగ్యులర్ బేసిస్ మీదనే అక్కడికి రేషన్ సరఫరా అవుతోంది.
- భద్రాచలం పట్టణానికి చెందిన డ్రెయినేజీ నీరు గోదావరిలో కలిసే స్లూయిస్‌ల నుంచి ప్రతీ ఏడాది లీకవుతోంది. ఫలితంగా విస్తా కాంప్లెక్స్ ప్రాంతం మునిగిపోతోంది. వరద వచ్చినప్పుడల్లా ఇక్కడ మోటార్లు పెట్టి నీటిని తోడేయాల్సి వస్తోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని గత వరదల సందర్భంగా ఇచ్చిన హామీ ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.
- పై సమస్యల గురించి వరదల ముంపు నివారణకు జిల్లా స్థాయిలో సమావేశం నిర్వహించి ముందస్తు కార్యాచరణ సిద్ధం చేయాలి. గోదావరికి ఎక్కువగా ఆగస్టులో వరదలు వస్తుంటాయి. కానీ గతేడాది జూలై మొదటి వారంలో అనుకోని విపత్తులా ఏజెన్సీ గ్రామాలను ముంచెత్తి తీవ్ర నష్టం కలిగించింది. మరోమారు అలాంటి వరదలు సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలేంటనే విషయంలో అధికారుల వద్ద జవాబు లేదు. ఇప్పటికైనా వీటిపై సత్వరమే అధికారులు, ప్రభుత్వం స్పందించాలని వరద ప్రభావిత ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ అనుదీప్ ఆదేశం
- ప్రజావాణిలో వినతుల స్వీకరణ



ప్రజావాణిలో సమస్యలు వింటున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా నలుమూలల నుంచి ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి వినతులు సమర్పించే వారి సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కొత్తగూడెం ఆర్‌డీఓ స్వర్ణలతతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పర్యవేక్షించాలని డీఆర్‌ఓ అశోకచక్రవర్తికి సూచించారు. ప్రజావాణి వినతుల్లో కొన్ని ఇలా..

- 60 ఏళ్ల వయసున్న తాను ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడినని, కరోనా సోకి ఎడమకాలుకు బ్లాక్ ఫంగస్ రావడంతో కాలు తొలగించారని, కుటుంబ పోషణ భారంగా ఉందని, దళితబంధు మంజూరు చేయాలని భద్రాచలానికి చెందిన తోకల వెంకటేశ్వర్లు వినతిపత్రం సమర్పించగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి ఎండార్స్ చేశారు.
- దమ్మపేట సెంటర్‌లోని ఎస్టీ హాస్టల్‌లో గత సంవత్సరం స్వీపర్‌గా పనిచేశానని, భర్త ఆరోగ్య పరిస్థితి బాగాలేదని, ఈ సంవత్సరం కూడా కొనసాగించాలని, లేకుంటే కుటుంబపోషణ కష్టమవుతుందని జూలూరుపాడు మండలానికి చెందిన షేక్ రహీమున్నీసా దరఖాస్తు చేయగా, ఉపాధి కల్పన శాఖాధికారికి సిఫార్సు చేశారు.
- కొత్తగూడెం 14వ వార్డుకు చెందిన పటాన్ రుబీనాబేగం తాను వితంతువునని, అద్దె ఇంట్లో ఉంటున్నానని, ఆరోగ్య పరిస్థితి బాగా లేనందున డబుల్ బెడ్ రూం ఇల్లు ఇప్పించాలని కోరగా డీఆర్‌ఓకు ఎండార్స్ చేశారు.

ట్యాబ్‌లతో వేగంగా సమాచారం

జిల్లా సెక్టోరియల్ అధికారి సతీష్



ట్యాబ్‌లు అందిస్తున్న సతీష్, శ్రీరామ్మూర్తి

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖ అందిస్తున్న ట్యాబ్‌లతో సమగ్ర సమాచారాన్ని వేగంగా అందించే అవకాశం ఉంటుందని జిల్లా సెక్టోరియల్ అధికారి ఎన్.సతీష్ అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం ప్రధానోపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలి విడతగా అశ్వారావుపేట మండలంలో 55 ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌లు అందిస్తున్నామని, మిగిలిన పాఠశాలలకు కూడా త్వరలోనే అందజేస్తామన్నారు. యూడైస్ ద్వారా అందించే సమాచారమే ఎంతో కీలకమని, ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుతోపాటు మధ్యాహ్న భోజన పథకం సమగ్ర వివరాలను నమోదు చేయాలని సూచించారు. ట్యాబ్‌లు ప్రధానోపాధ్యాయుల సమక్షంలోనే ఉండాలని, పాఠశాల ఈ మెయిల్ ఐడీతోనే లాగిన్ కావాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ఎంఈఓ పెండెకంట్ల కృష్ణయ్య, జిల్లా టెక్నికల్ పర్సన్ మోహన్, కాంప్లెక్స్ హెచ్‌ఎం సీహెచ్ నరసింహారావు, సీఆర్పీలు ప్రభాకరాచారి, రామారావు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి



మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

కొత్తగూడెంటౌన్ : ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా సంక్షేమాధికారిణి సబిత, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మాదక ద్రవ్యాల నిరోధానికి అందరూ సహకరించాలని కోరారు. మాదకద్రవ్యాలను సేవించినా, అక్రమంగా తరలించినా చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పి.కరమ్ చంద్, సీడీపీఓ స్వర్ణలత లెనినా, సఖి సెంటర్ నిర్వాహకులు శుభశ్రీ, గురునాథ్ రాథోడ్, సీహెచ్. నాగేశ్వర్‌రావు, అశోక్‌కుమార్, డి.సాయి కుమార్, గౌతమ్, అబిద్, కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్, ఎస్ఐ విజయ, సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ నాయకులు నాగేశ్వరావు, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

నర్సరీల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి



నర్సరీని తనిఖీ చేస్తున్న మరియన్న

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని ఇల్లెందు, టేకులపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు మండలాల్లో మిరప, కూరగాయల నర్సరీలను జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖాధికారి జినుగు మరియన్న సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నర్సరీలలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ఉత్తమమైన నారే పెంచాలని, ఆరుబయట పెంచే నారు కొనుగోలు చేయవద్దని చెప్పారు. లైసెన్స్ లేని నర్సరీల నుంచి నారు కొనవద్దన్నారు.

బీసీ హాస్టల్ సందర్శన

అశ్వాపురం: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని జిల్లా సహాయ బీసీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి సోమవారం సందర్శించారు. హాస్టల్‌లో రికార్డులు తనిఖీ చేసి గదులను పరిశీలించారు. నూతన అడ్మిషన్లపై వార్డెన్‌తో చర్చించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం హాస్టల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ నరసింహారావు, సిబ్బంది రమేష్, రాజారెడ్డి పాల్గొన్నారు.

ముహూర్తం కుదిరింది..!

- కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఢిల్లీలో ప్రకటించిన పొంగులేటి
- వచ్చే నెల 2న ఖమ్మంలో బహిరంగ సభ
- రాహుల్‌గాంధీ సమక్షాన చేరికలు
- ఏఐసీసీ అగ్రనేతలతో సభపై చర్చించిన మాజీ ఎంపీ



ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో కరచాలనం చేస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి.. పక్కన ఆయన తనయుడు హర్షారెడ్డి, బొర్రా రాజశేఖర్, మువ్వా విజయ్‌బాబు, పాయం వెంకటేశ్వర్లు, జూపల్లి, దొడ్డా నగేష్, జారె ఆదినారాయణ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: సుమారు ఆరు నెలలుగా సస్పెన్స్ థ్రిల్లర్‌ను తలపించిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎపిసోడ్ ఓ కొలిక్కి వచ్చింది. ఆయన తన అనుచరవర్గంతో కలిసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఢిల్లీ వేదికగా ప్రకటించారు. వచ్చేనెల 2న ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో తన మద్దతుదారులతో కలిసి రాహుల్ గాంధీ సమక్షాన కాంగ్రెస్ కండువా కప్పుకుంటామని వెల్లడించారు. హస్తినలో ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీని సోమవారం ఆయన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతలతోపాటు కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరడానికి దారితీసిన పరిస్థితులను వివరించారు.

2014లో ఎంపీగా గెలిచి..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించారు. 2014 ఎన్నికల్లో తాను ఎంపీగా గెలవడంతోపాటు సీపీఎం మద్దతుతో వైరా, అశ్వారావుపేట, పినపాక నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇక వైఎస్సార్‌సీపీ మద్దతుతో భద్రాచలం నియోజకవర్గాన్ని కూడా సీపీఎం దక్కించుకుంది. ఆ తర్వాత పరిణామాల నేపథ్యాన ఆయన బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అయితే పార్టీలో అనుకున్న స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో అసంతృప్తికి లోనవుతూ వచ్చారు. 2019లో పార్లమెంట్ ఎన్నికల సమయంలో అప్పటికే ఎంపీగా ఉన్న పొంగులేటికి టికెట్ దక్కకపోగా, రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవులు వస్తాయని ప్రచారం జరిగినా అవీ రాకపోవడంతో తీవ్ర అసంతృప్తితో కొనసాగారు.

చివరకు 'చేయి' అందుకుని..

దాదాపు నాలుగేళ్ల అనంతరం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ ఏడాది జనవరి 1న ఖమ్మంలో ఏర్పాటు చేసిన ఆత్మీయుల సమావేశంలో తన అసంతృప్తిని బయటపెట్టారు. అయితే, ఈ సమావేశంలో అసంతృప్తిని మాత్రమే వ్యక్తం చేయగా, నియోజకవర్గాల వారీ ఆత్మీయ సమావేశాల్లో మాత్రం సీఎం కేసీఆర్ లక్ష్యంగా విమర్శలు ఎక్కుపెట్టారు. తనకు కనీస గౌరవం ఇవ్వలేదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీంతో పొంగులేటి బీజేపీ లేదా కాంగ్రెస్‌లో చేరతారని.. లేదంటే కొత్త పార్టీ పెడతారని ప్రచారం సాగింది. ఇంతలోనే సర్వేలు చేయించుకున్న ఆయన, అనుచరగణం ముక్తకంఠంతో చెప్పడంతో కాంగ్రెస్‌లో చేరికకు నిర్ణయించుకున్నారు.



మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీని సన్మానిస్తున్న పొంగులేటి, రేవంత్‌రెడ్డి

రాహుల్‌కు నేతల పరిచయం

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పొంగులేటి వెంట పలువురు నేతలు ఢిల్లీకి తరలివెళ్లారు. ఈ సందర్భంగా సమావేశం అనంతరం పొంగులేటి.. జిల్లా నేతలను రాహుల్‌గాంధీకి పరిచయం చేశారు. ఆ తర్వాత మాజీ మంత్రి జూపల్లితో కలిసి ప్రియాంకగాంధీతో సమావేశమయ్యారు. పొంగులేటి వెంట వెళ్లిన వారిలో భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, నేతలు మువ్వా విజయ్‌బాబు, తెల్లం వెంకట్రావు, పిడమర్తి రవి, జారె ఆదినారాయణ, బానోతు విజయాబాయి, తుళ్లూరి బ్రహ్మయ్య, మచ్చా శ్రీనివాసరావు, తుంబూరి దయాకర్ రెడ్డి, మద్దినేని బేబి స్వర్ణకుమారి, బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్, రామసహాయం నరేష్‌రెడ్డి, డాక్టర్ కోటా రాంబాబు, ఊకంటి గోపాలరావు, డాక్టర్ రాజారమేష్, జూపల్లి రమేష్, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

2న ఖమ్మంలో సభ..

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన బృందంతో కలిసి ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ తదితరులతో సోమవారం సమావేశమయ్యాక విలేకరులతో మాట్లాడారు. వచ్చేనెల 2న ఖమ్మంలో భారీ బహిరంగ సభ ద్వారా కాంగ్రెస్‌లో చేరతామని, ఈ సభకు రాహుల్‌గాంధీ హాజరవుతారని తెలిపారు. ఆ దిశగా భారీ సభ నిర్వహణకు ఖమ్మం ఎస్‌ఆర్ గార్డెన్స్ వెనుక పొంగులేటి వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాట్లు మొదలుపెట్టగా, సభ విజయవంతం, జనసమీకరణ కోసం ఇప్పటికే నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఈ ఏడాది జనవరి 18న నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభను తలదన్నేలా తమ సభ ఉంటుందని పొంగులేటి చెబుతున్నారు. రాష్ట్రస్థాయిలో చేరికల పరంగా ఇదే భారీ సభ కానుండటంతో పొంగులేటితో పాటు ఇతర జిల్లాల నేతలు కూడా ఈ సభలోనే కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

మావోయిస్టులు అభివృద్ధి నిరోధకులు

భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్



గోడ స్టిక్కర్లు అంటించిన ఏఎస్పీ పరితోష్, పోలీసు సిబ్బంది

దుమ్ముగూడెం: మావోయిస్టులు అభివృద్ధి నిరోధకులుగా మారి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ అమాయక ఆదివాసీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వలస ఆదివాసీ గ్రామం గడ్డె మడుగు గ్రామంలో గడప గడపకు 'సమాచారం మాకు - బహుమతి మీకు' కార్యక్రమం నిర్వహించారు. మావోయిస్టుల సమాచారం అందచేయాలని కోరుతూ ముద్రించిన స్టిక్కర్లను ఇళ్లకు అంటించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఆదివాసీలను అభివృద్ధికి దూరం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలెవరూ భయపడకుండా స్టిక్కర్లలో ఉన్న నంబర్లకు ఫోన్ చేసి మావోయిస్టుల సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ రమేష్, ఎస్ఐలు నర్సిరెడ్డి, కేశవరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పీవైఎల్ జిల్లా కమిటీ ఎన్నిక



నరసింహారావు, రవి

టేకులపల్లి: ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా నూతన కమిటీని సోమవారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా చింత నరసింహారావు, పర్షిక రవి, ఉపాధ్యక్షులుగా ముసలి సతీశ్ (చర్ల), సహాయ కార్యదర్శిగా మోతిలాల్ (ఇల్లెందు), కోశాధికారిగా లాజర్ (గుండాల)తోపాటు మరో 14 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలని, ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలని, గ్రామాల్లో మద్యం షాపులను రద్దు చేయాలని, గుట్కా ఫ్యాక్టరీలను మూసివేయాలని తీర్మానాలు చేసినట్లు నూతన కమిటీ సభ్యులు తెలిపారు. వచ్చే నెల 4,5 తేదీల్లో ఇల్లెందులో జరిగే రాష్ట్ర 8వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

పెన్షన్ మంజూరైనా.. బ్యాంకు అధికారులు ఇవ్వట్లే..



పెన్షన్ పత్రం చూపిస్తున్న వృద్ధురాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): గత ఆగస్టులో ఆసరా పెన్షన్ మంజూరైనా తనకు పింఛను సొమ్ము అందడం లేదని ఓ వృద్ధురాలు వాపోయింది. పాల్వంచ మున్సిపాలిటీ ఒడ్డుగూడేనికి చెందిన పూనెం అదెమ్మ సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు తన సమస్య విన్నవించింది. తాను ఇళ్లల్లో పనిచేసి జీవనం సాగిస్తున్నాని, దీంతో వేలిముద్రలు పడక బ్యాంకు అధికారులు పెన్షన్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. మున్సిపాలిటీ, బ్యాంకు చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయాయని, తెలిసిన వాళ్ల సాయంతో కలెక్టర్‌కు మొరపెట్టుకునేందుకు వచ్చానని తెలిపింది.

రాకపోకలకు అంతరాయం

తల్లాడ–కొత్తగూడెం రహదారిపై విరిగిపడ్డ చెట్టు



రోడ్డుపై అడ్డంగా విరిగిపడ్డ చెట్టు

జూలూరుపాడు: మండలంలోని వినోభానగర్ గ్రామ సమీపంలో తల్లాడ–కొత్తగూడెం ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఉన్న చెట్టు కొమ్మ విరిగిపడింది. దీంతో సుమారు గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వినోభానగర్ సర్పంచ్ భూక్యా పద్మ, గ్రామ పంచాయతీ సిబ్బంది అక్కడకు చేరుకుని రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టు కొమ్మలను తొలిగించారు. దీంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కొత్తగూడెంఅర్బన్: ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి గాయాలపాలై, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి సోమవారం మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన కుక్కమూడి శ్రీను(44) సైకిల్‌పై ఆదివా రం సెవెల్‌హిల్స్ ఏరియా నుంచి వెళ్తున్న సమయంలో అక్కడ ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల ఎదురుగా ఉన్న డ్రెయినేజీలో పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబీకులు కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి అల్లుడు మహేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'అటవీ' దొంగలు?

- స్మగ్లర్లకు సహకరిస్తున్న కొందరు అటవీశాఖ సిబ్బంది
- నామమాత్రపు చర్యలతోనే ఉన్నతాధికారుల సరి
- ఇదే అదునుగా విలువైన కలపను నరికి తరలిస్తున్న అక్రమార్కులు



జిల్లా అటవీశాఖ కార్యాలయం

చుంచుపల్లి: ఒకవైపు హరితహారం కింద రాష్ట్ర ప్రభుత్వం మొక్కలను విరివిగా నాటుతూ అడవులను పెంచేలా చర్యలు తీసుకుంటుంటే మరోవైపు అడవులను నిరంతరం కాపాడాల్సిన అటవీశాఖ సిబ్బందిలో కొందరు ఇంటిదొంగలుగా మారుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా అక్రమార్కులకు సహకరిస్తున్నారు. ఇదే అదునుగా అక్రమార్కులు విలువైన టేకు, జిట్రేగి, వేప, తుమ్మ చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గడిచిన ఏడాది కాలంగా కలప స్మగ్లర్లకు సహకరిస్తున్నారనే కారణంతో ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు, కొత్తగూడెం అటవీ డివిజన్ల పరిధిలో పలువురు సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అయినా కలప అక్రమంగా తరలిపోతోంది. ఉన్నతాధికారులు నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకుంటున్నారని, అందుకే సిబ్బందిలో మార్పు రావడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కొన్ని సంఘటనలను పరిశీలిస్తే..

- దుమ్ముగూడెం మండలంలో రెండేళ్ల క్రితం ఇద్దరు అటవీశాఖ సిబ్బంది మధ్య కలప రవాణాకు సంబంధించిన పంపకాల్లో తేడా రావడంతో గొడవ జరిగింది. దీంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టి వారిపై సస్పెన్షన్ వేటు వేశారు.
- భద్రాచలం డివిజన్ పరిధిలోని ఒక గ్రామంలో అక్రమంగా కలపను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానికులు గుర్తించి ఆపేశారు. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన క్షేత్రస్థాయి అటవీ ఉద్యోగిపై అధికారులు చర్యలు తీసుకున్నారు.
- గతేడాది మార్చిలో చాతకొండ రేంజ్ పరిధిలో అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా కలప తరలిస్తూ కొత్తగూడెం క్రాస్ రోడ్డు వద్ద పట్టుబడిన వాహనాన్ని వదిలేసేందుకు సహకరించారనే కారణంతో ఒక రేంజ్ ఆఫీసర్‌తో పాటు, ఇద్దరు బీట్ ఆఫీసర్లను సస్పెండ్ చేశారు.
- అదే ఏడాది జూన్‌లో అశ్వాపురం రేంజ్ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలప విషయంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. అధికారుల నివేదిక ఆధారంగా ఇందులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు బీట్ ఆఫీసర్లను సస్పెండ్ చేశారు.
- ఇల్లెందు రేంజ్ పరిధిలో కలప విక్రయం, నిధుల గోల్‌మాల్ వంటి అవినీతి ఆరోపణల నేపథ్యంలో విచారణ చేసిన అటవీశాఖ ఉన్నతాధికారులు గతేడాది జూలైలో ఒక రేంజర్‌తోపాటు ఇద్దరు సెక్షన్ ఆఫీసర్లు, ఒక బీట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేశారు.
- ఇక తాజాగా అశ్వాపురం రేంజ్ ఇరవెండి పరిధిలో జామాయిల్ కలపను కొట్టి ఐటీసీ కాంట్రాక్టర్లతో కలిసి విక్రయించారనే ఆరోపణలతో విచారణ చేపట్టి అటవీశాఖ జిల్లా అధికారులు ఒక సెక్షన్ ఆఫీసర్, ఒక బీట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేశారు.

ఉపేక్షించేది లేదు



అటవీశాఖలో పనిచేస్తూ తప్పుడు మార్గాల్లో స్మగ్లర్లకు సహకరించే అటవీ సిబ్బంది విషయంలో ఉపేక్షించేది లేదు. అలాంటి వారిపై నిఘా పెట్టి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలువురిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నాం. పద్ధతి మార్చుకోకపోతే శాఖాపరంగా కఠినమైన చర్యలకు సైతం వెనకాడబోం.

–లక్ష్మణ్ రంజిత్ నాయక్, డీఎఫ్ఓ

'రోటరీ క్లబ్ ఆఫ్ భద్రా'కు అవార్డులు



అవార్డులు అందుకున్న రోటరీ క్లబ్ ఆఫ్ భద్రా ప్రతినిధులు

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాకు 20 అవార్డులు దక్కాయి. క్లబ్ చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా చైతన్య కార్యక్రమాలను గుర్తించి రోటరీ డిస్ట్రిక్ట్ –3150 ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డులు అందించారు. ఎకనామిక్ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, తెలంగాణ లార్జ్ క్లబ్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, తెలంగాణ లార్జ్ క్లబ్ సర్వీస్ ప్రాజె క్ట్, స్పెషల్ రికగ్నైజేషన్ ఫర్ గోదావరి ఫ్లడ్ రిలీఫ్ ఎక్టివిటీస్, స్పెషల్ రికగ్నైజేషన్ ఫర్ హ్యాపీ స్కూల్ విభాగాల్లో ఉత్తమ అవార్డులు, రీజియన్ డీజీ విజిట్‌లో 7 అవార్డులు, ఇతర విభాగాల్లో ఉత్తమ సేవా అవార్డులు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రాజశేఖర్ తాళ్ల చేతుల మీదుగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ భాస్కరరావు, డాక్టర్ విజయ్‌కుమార్ అవార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు సత్యనారాయణ, మురళీకృష్ణ, ప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు చూపిస్తున్న సభ్యులు

భద్రాచలం క్లబ్‌కు..

భద్రాచలంఅర్బన్: భద్రాచలానికి చెందిన రోటరీ డిస్ట్రిక్ట్ కమిటీ సభ్యుడు పలివెల రవికుమార్‌కు ప్రత్యేకంగా కమ్యూనికేషన్ అవార్డు, సహాయ గవర్నర్ భూషణరావు సేవలకు ప్రశంసాపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ భద్రాచలం అధ్యక్షులు వీసం వసంతరావు, కార్యదర్శి రమేష్, సానికొమ్ము శంకర్‌రెడ్డి, అజీమ్, మహాలక్ష్మి, శ్రీను, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉండాలి

సింగరేణి డైరెక్టర్ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): నోటిఫికేషన్ల విడుదల సమయంలో పాలసీ ప్రకారం పారదర్శకంగా ఉండాలని, అభ్యర్థులు కోర్టుకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్ (పా) సూచించారు. సోమవారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని ఇల్లెందు గెస్ట్ హౌస్‌లో పర్సనల్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీలతో సమావేశం నిర్వహించారు. ఎంఎంసీ, ఎస్ఎల్‌సీ, క్యాంటీన్, క్వార్టర్లలో ఇల్లీగల్ ఆక్యుపెషన్ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ డిపెండెంట్ల విషయంలో కొందరు అధికారులు ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారనే సమాచారం తనకు ఉందని, తన దృష్టికి వస్తే వారిపై వేటు తప్పదని అన్నారు. పర్సనల్ విభాగం అధికారులు, ఉద్యోగులు కంపెనీ సర్క్యులర్లపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో జీఎంలు ఎ.కుమార్‌రెడ్డి, కట్టా సబవయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ బలరామ్



ఆర్థికసాయం అందిస్తున్న ఉద్యోగులు

సింగరేణి ఉద్యోగుల ఆర్థికసాయం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ ఏరియాలోని క్వాలిటీ మేనేజ్‌మెంట్ విభాగం అధికారులు, ఉద్యోగులు నిరుపేద విద్యార్థికి సోమవారం ఆర్థికసాయం అందించారు. ఆటో డ్రైవర్ కుమారుడైన బూషి వెంకటేశ్ ఎంటెక్ (మైనింగ్) చదువుతున్నాడు. అతని ఆర్థిక పరిస్థితి సరిగ్గాలేని కారణంగా గతేడాది ఫీజు చెల్లించలే దు. దీంతో ఉస్మానియా యూనివర్సిటీ నిర్వాహకులు విద్యార్థి ఫలితాలు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో సింగరేణి అధికారులు, కెమిస్టు, శాంప్లింగ్,ల్యాబ్ సిబ్బంది, హెడ్డాఫీసు ఉద్యోగులు, రిటైర్డ్ అధికారులు కలిసి రూ.1.16 లక్షలు క్వాలిటీ జీఎం హబీబ్ హుస్సేన్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు లోగనాథన్, పి. వీరభద్రరావు, టీబీజీకేఎస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, సీహెచ్ శ్రీనివాస్, ఎస్.నరసింహారావు, పి.కుమారస్వామి, బాబూరావు, నాగరాజు, రాజు, సుధాకర్‌రావు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు మద్యం అశ్వారావుపేటలో..?

- కన్నాయిగూడెంలో పోలీసుల తనిఖీలు!
- అదుపులో ఓ బెల్ట్ షాపు నిర్వాహకుడు?

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్న కన్నాయిగూడెం గిరిజన గ్రామంలో సోమవారం రాత్రి పోలీసుల బృందాలు తనిఖీలు నిర్వహించాయి. గ్రామంలోని బెల్ట్ దుకాణాల్లో బూర్గంపాడు నుంచి వచ్చిన పోలీస్ బృందాలతోపాటు అశ్వారావుపేట పోలీసుల ఆధ్వర్యంలో దాడులు చేపట్టడంతో ఒక్కసారిగా కలకలం రేపింది. కాగా ఈ నెల 24న బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలోని ఓ మద్యం దుకాణంలో సుమారు రూ.3.39 లక్షల విలువైన చీప్ లిక్కర్‌ను దుండగులు అపహరించారు. మద్యం షాపులో చోరీకి గురైన చీప్ లిక్కర్ బాటిళ్లను కన్నాయిగూడెంలోని బెల్ట్ షాపుల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో బూర్గంపాడు పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ తనిఖీల్లో ఓ బెల్ట్ షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. గ్రామంలోని మిగిలిన అన్ని షాపుల్లో సోదాలు చేస్తున్నారు. దీంతో చోరీకి గురైన మద్యం బాటిళ్లు పెద్ద సంఖ్యలో లభ్యమైనట్లు ప్రచారం సాగుతోంది. గడిచిన నెల రోజుల వ్యవధిలో బూర్గంపాడు మండలంలోని లక్ష్మీపురం, సారపాక, దమ్మపేట ప్రాంతాల్లో మద్యం దుకాణాల్లో చోరీలు జరగ్గా, జిల్లా పోలీసులు సవాల్‌గా తీసుకుని ప్రత్యేక బృందాలుగా విచారణ చేపట్టారు. పోలీసు, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సంయుక్త విచారణ చేపట్టిన అధికారులు కన్నాయిగూడెంలో కొన్ని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై స్థానిక సీఐ బాలకృష్ణ, ఎస్సై బి.రాజేశ్ కుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు.

సమస్యల పరిష్కారానికి రిటైర్డ్ ఉద్యోగుల నిరసన

ఖమ్మం మామిళ్లగూడెం: రిటైర్డు ఉద్యోగుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కల్యా ణం కృష్ణయ్య, ఎం.సుబ్బయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య, సుబ్బయ్య మాట్లాడు తూ ఆరోగ్య కార్డులు, నూతన పీఆర్సీ కమిటీ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల పరిష్కారంపై ఇకనైనా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డీ.కే.శర్మ, వేణు, వీరయ్య, సాంబశివరావు, పూర్ణచంద్రరావు, కృష్ణమూర్తి, మారంరాజు రాధాకృష్ణారావు, హన్మంతరావు, బాబురావు, రమేష్, బస్వారావు, వెంకటనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న రిటైర్డు ఉద్యోగుల సంఘం బాధ్యులు

అందరికీ పోడు పట్టాలు ఇవ్వాలి

సింగరేణి(కొత్తగూడెం): దరఖాస్తు చేసుకున్న గిరిజన, గిరిజనేతర రైతులందరికీ పోడు పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శేషగిరిభవన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తుదారులందరికీ హక్కు పత్రాలు ఇవ్వకపోతే ఉద్యమిస్తామని తెలిపారు. నిబంధనల పేరుతో పేదలకు అన్యాయం చేయొద్దని, పట్టాలు ఇచ్చి బతుకుదెరువు చూపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బందెల నర్సయ్య, గుత్తుల సత్యనారాయణ, దుర్గారాశి వెంకటేశ్వర్లు, వై.శ్రీనివాస్‌రెడ్డి, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, భూక్యా దస్రు, వీరస్వామి, వంగా వెంకట్, మునిగడప వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సమావేశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటుకు ఈనెల 28న ఉదయం 10 గంటలకు ఐడీఓసీ సమావేశ హాలులో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్య శాఖాధికారి బి.వీరన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల, మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల, ప్రైమరీ మార్కెటింగ్ సొసైటీ సంఘాల అధ్యక్షులు, ఫిషర్మెన్ లైసెన్స్ హోల్డర్లు మాత్రమే హాజరు కావాలని సూచించారు.

మత్తు పదార్థాల రవాణాను అరికట్టాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రికా రెడ్డి

న్యాయమూర్తి చంద్రికా రెడ్డి

ఇల్లెందు: మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టాలని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రికా రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సత్ప్రవర్తనతో సూచించారు. చట్టాలను గౌరవించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి సత్యప్రకాష్, భూక్యా రవికుమార్, జాయింట్ సెక్రెటరీ కీర్తి కార్తీక్, ట్రెజరర్ ఉమామహేశ్వరరావు, బోడ వినయ్, హెచ్ఎం పద్మ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఏటీడీఓ తనిఖీ కోసం వస్తే..

ప్రాథమిక పాఠశాలకు తాళం



తాళం వేసి ఉన్న గంగారంతండా పాఠశాల వద్ద ఏటీడీఓ రూపాదేవి

జూలూరుపాడు: మండల పరిధిలోని గంగారంతండా గిరిజన ప్రాథమిక పాఠశాలకు సోమవారం ఇల్లెందు ఏటీడీఓ రూపాదేవి ఆకస్మిక తనిఖీకి వచ్చారు. ఆ సమయంలో పాఠశాలకు తాళం వేసి ఉండటంతోపాటు ఉపాధ్యాయుడు రాములు కూడా అక్కడ లేరు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుడి తీరుపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో విచారణ కోసం వచ్చినట్లు తెలిపారు. ఉపాధ్యాయుడు పాఠశాలకు సక్రమంగా రాకపోవడం, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ఫోన్‌లో మాట్లాడుతూ కాలక్షేపం చేయడం వంటి ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడు పిల్లలకు చదువు చెప్పకపోవడంతో ఇతర పాఠశాలలకు పంపిస్తున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు చెప్పినట్లు ఏటీడీఓ రూపాదేవి తెలిపారు. ఉపాధ్యాయుడికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుందని ఏటీడీఓ చెప్పారు. ఇందుకు సంబంధించిన సమగ్ర నివేదికను డీడీకి అందజేయనున్నామని, తదుపరి చర్యలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పడమటనర్సాపురం ఏజీహెచ్ఎస్ హెచ్ఎం సుభద్రమ్మ, ఎస్ఈఆర్‌పీ ఎం.భీక్యా ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

భద్రాచలంఅర్బన్/దుమ్ముగూడెం/చర్ల : ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని అంగనవాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతురాజు జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16న ప్రారంభించిన రాష్ట్రస్థాయి జీపు జాతా కార్యక్రమం సోమవారం భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లో సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం, పింఛను, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడిచినా అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు. కేంద్రం తెచ్చిన నూతన విద్యావిధానంతో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఖాళీ పోస్టులను భర్తీ చేయడం లేదని ఆరోపించారు. 2017 నుంచి 2023 వరకు రావాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని, ఆరోగ్య లక్ష్మి మెనూ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి, నాయకులు కృష్ణవేణి, జి.పద్మ, ఈసం వెంకటమ్మ, జి. శ్రీను, ఎంబీ నర్సారెడ్డి, రేణుక, లలిత, విజయలక్ష్మి, మిడియం సావిత్రి, రాజేశ్వరి, వీరభద్రమ్మ, గజలక్ష్మి, కమలాదేవి, రాధ, విజయ, రమణ, బుచ్చమ్మ, జానకమ్మ, పాయం రాధాకుమారి, స్వరూప, చిలకమ్మ, కమల మనోహరి, ఇర్పా సత్యావతి, సావిత్రి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

వివాదాస్పదంగా మురుగు సమస్య

ఇల్లెందురూరల్: కొమరారం గ్రామంలో మురుగు నీటి ప్రవాహం అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు నీరంతా ఒకే చోటకు చేరుతోంది. దీంతో ఏటా వర్షాకాలంలో ఒకే వీధిలోని ఇళ్లన్నీ జలమయమవుతున్నాయి. తాజాగా కురుస్తున్న వర్షాలకు మళ్లీ అదే సమస్య ఉత్పన్నమైంది. దీంతో వీధిలోకి మురుగు నీరు రాకుండా స్థానికులు కల్వర్టు పైపునకు అడ్డుగా మట్టితో నింపారు. మురుగునీరు కాల్వలోనే నిల్వ ఉండటంతో గ్రామపంచాయతీ అధికారులు అక్కడకు చేరుకుని అడ్డుగా పోసిన మట్టిని తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహించిన స్థానికులు గ్రామంలో కాల్వలను సరిచేసి మురుగునీటి ప్రవాహం పక్రమంగా సరఫరా అయ్యేలా చూడాల్సిన అధికారులు ఒకే వీధిలోకి మళ్లించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇతర ప్రాంతాల్లో మురుగుకాల్వలను పూర్తిగా పూడ్చివేయడం వల్లే గ్రామంలోని మురుగు నీరంతా తమ వీధిలోకి చేరుతోందని వాపోయారు. గ్రామంలోని మురుగుకాల్వలను సరిచేసేవరకు కల్వర్టు పైపునకు అడ్డుగా పోసిన మట్టిని తొలగించొద్దని స్పష్టం చేశారు. గ్రామపంచాయతీ అధికారులతో సమాచారంతో అక్కడకు చేరుకున్న పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా స్థానికులు శాంతించలేదు. దీంతో పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు, సమష్టిగా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించి వెనుదిరిగారు.



అధికారులను ప్రశ్నిస్తున్న స్థానికులు

క్లుప్తంగా...

పవన్ కులాలు, మతాలను రెచ్చగొడుతున్నారు

ఏపీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి



తిరుపతి అర్బన్: గూండాలు, వెన్నుపోటుదారులు టీడీపీ గట్టు వైపే ఉన్నారని.. తమ పార్టీలో అలాంటి నేతలు ఎవరూ లేరని ఏపీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి స్పష్టంచేశారు. అవినీతి రాజ్యం చంద్రబాబు పాలనలోనే సాగిందని.. వంగవీటి రంగాను హత్య చేయించింది ఆయనేనని ఆరోపించారు. మరోవైపు.. పవన్ పదే పదే మతాలు, కులాలను రెచ్చగొట్టి విధ్వంసం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని నారాయణ స్వామి మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ముద్రగడ పద్మనాభం కాపుల సంక్షేమం కోసం పోరాడుతుంటే.. ఆ పోరాటాన్ని అణగదొక్కిన ఘనత చంద్రబాబుదే. ఆ సమయంలో పవన్‌కల్యాణ్ చంద్రబాబును ఒక్కసారి కూడా ప్రశ్నించలేదు. చిరంజీవి విలువలతో కూడిన రాజకీయం చేశారు. అయితే, ఆయన తమ్ముడు పవన్‌కల్యాణ్ మాత్రం చెప్పులతో దాడిచేస్తాం.. రాళ్లతో దాడి చేస్తామంటూ నీచ రాజకీయాలు చేస్తున్నారు. అసలు కాపులకు ఆయన చేసింది ఏమిటి? వారాహి యాత్ర ద్వారా చంద్రబాబుకు లబ్ధిచేకూర్చడానికి ప్రయత్నిస్తున్నారు' అని పేర్కొన్నారు.

ప్రపంచానికి 'యోగి'లను అందిస్తాం: రాందేవ్



హరిద్వార్: యోగాతో ప్రపంచానికి మరింత ఆరోగ్యాన్ని అందించేందుకు పతంజలి యూనివర్సిటీ విద్యార్థులు భవిష్యత్‌లో ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి యూనివర్సిటీలకు వెళ్తారని స్వామి రాందేవ్‌బాబా అన్నారు. అన్ని హద్దులను చెరిపేసి ఇప్పుడు హిందూ, ముస్లిం, సిక్కు, క్రిస్టియన్, జైన్, బుద్ధిస్టులందరూ దేశమంతటా యోగా చేస్తున్నారని తెలిపారు. యోగావల్ల దేశప్రతిష్ఠ ఇప్పుడు విశ్వవ్యాప్తిమయ్యిందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పతంజలి వెల్‌నెస్ సెంటర్‌లోని పతంజలి యోగాపీఠ్ మైదానంలో యోగా సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాందేవ్.. పలువురు యోగా సాధకులను ఉద్దేశించి ప్రసంగించారు.

గూడు చెదిరి.. గుండెలవిసి!

అంతర్గాంలోని బర్మా, శ్రీలంక కాందిశీకుల దీనావస్థ

1971 నాటికి 1,000 కుటుంబాలకు ఇక్కడ పునరావాసం

1989లో దేశవ్యాప్తంగా నాలుగెకరాల భూమి, ఇళ్ల స్థలాల పంపిణీ

అంతర్గాంలో 502 ఎకరాలు కేటాయించినా సొంతింటికి నోచుకోని వైనం

వెయ్యికిగాను ఇప్పుడు మిగిలింది 374 కుటుంబాలే..

తమకైనా కనీసం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించాలని వినతి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్

ప్రాణభయంతో ఓ దేశం నుంచి మరో దేశానికి వలస వెళ్లే వారిని కాందిశీకులు అంటారు. ఇలాంటి వారికి పరాయిగడ్డపై ఆశ్రయం దొరకడమే గగనం. దొరికినా వారికి పెద్దగా హక్కులు ఉండవు. కానీ బ్రిటిష్ పాలనలో పని కోసం మన దేశం నుంచి పొరుగున ఉన్న బర్మా (మయన్మార్), శ్రీలంకలకు వలసవెళ్లి అక్కడ సైనిక నియంతల హెచ్చరికలు, అంతర్యుద్ధాల కారణంగా తిరిగి భారతదేశానికి వచ్చిన కాందిశీకులది మరో కథ. వెళ్లిన కొన్నేళ్ల తర్వాత మాతృ దేశంలో బిక్కుబిక్కుమంటూ అడుగుపెట్టిన వారిని భారత్ తల్లిలా అక్కున చేర్చుకుంది. వారికి పునరావాసం కల్పించింది. దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం అంతర్గాంలో వెలసిన శరణార్థుల కాలనీలో తెలుగు వారికి కేంద్రం పునరావాసం కల్పించింది. ఇలాంటి వారందరికీ దేశవ్యాప్తంగా..ఇళ్లు, వ్యవసాయ స్థలాలు పంపిణీ చేసినా అంతర్గాంలో మాత్రం ఇంకా ప్రభుత్వ హామీలు నెరవేరలేదు. తమకు కనీసం ఇళ్లైనా మంజూరు చేయాలని వారు దీనంగా వేడుకుంటున్నారు.

అసలు ఏం జరిగింది?



లాల్ బహదూర్ శాస్త్రి-సిరిమావో బండారు నాయకేల ఇండో, శ్రీలంక ఒప్పందం 1964 (ఫైల్)

19వ శతాబ్దంలో దేశంలో విపరీతమైన కరువు వచ్చింది. ఈ కరువును ఎదుర్కొనే ప్రయత్నాలు చేయకుండా మన దేశంలోని పేదలను బర్మా, శ్రీలంక, మలేసియా తదితర దేశాల్లో తోటల్లో పనిచేసేందుకు కూలీలుగా పంపారు. అలా గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర నుంచి వేలాదిమంది బర్మాకు వలస వెళ్లారు. అక్కడ వ్యాపారాలు, పనులు చేసి రూ.కోట్లు గడించారు. అయితే 1962లో బర్మాలో సైనిక నియంత నె విన్ తిరుగుబాటుతో ప్రభుత్వం కుప్పకూలింది. పగ్గాలు చేపట్టిన నె విన్ విదేశీయులు కట్టుబట్టలతో దేశం విడిచి వెళ్లాలంటూ హుకూం జారీ చేశాడు. సైనికులు భారతీయుల ఇళ్లను దోచుకున్నారు. కనీసం మెడలో తాళిబొట్టును కూడా అనుమతించలేదు. అయితే అప్పటి భారత ప్రధాని నెహ్రూ ఆధ్వర్యంలో ఇరుదేశాల మధ్య జరిగిన ఒప్పందం మేరకు భారత సంతతి ప్రజలను దేశానికి తీసుకొచ్చి దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో క్యాంపులు ఏర్పాటు చేసి ఆశ్రయం కల్పించారు. ఈ తరలింపు లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ హయాం వరకు పలు దఫాలుగా సాగింది. వీరితో పాటే శ్రీలంకలో జాతుల మధ్య పోరు వల్ల ఇండియాకు వచ్చిన తమిళులకూ చోటు ఇచ్చారు. ఇలా 1971 నాటికి అంతర్గాంలో దాదాపు 1,000 బర్మా, శ్రీలంక కుటుంబాలు ఆశ్రయం పొందాయి. 1989లో దేశవ్యాప్తంగా ఇలాంటి వారికి నాలుగెకరాల భూమి, ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇదే క్రమంలో అంతర్గాం కాందిశీకులకు కేంద్రం 502 ఎకరాల భూమి కేటాయించింది. ప్రత్యేకంగా వీవింగ్ సొసైటీని ఏర్పాటు చేసి జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లులు తెరిచి ఉపాధి కల్పించింది. అప్పట్లో తెరిచిన మిల్లులు అధికారుల అవినీతి కారణంగా 1990వ దశకంలో మూతబడ్డాయి. కార్మికులకు కనీసం వేతన బకాయిలు, పీఎఫ్, ఈఎస్ఐ కూడా రాలేదు. ఉపాధి కోల్పోవడంతో ఆకలి మరణాలు సైతం సంభవించాయి. కొన్ని కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లగా.. ప్రస్తుతం ఇక్కడ 374 కుటుంబాలు మాత్రమే మిగిలాయి. కానీ ఇప్పటికీ భూమి, ఇళ్ల స్థలాలకు సంబంధించిన హామీ మాత్రం నెరవేరలేదు.

ఇండస్ట్రియల్ పార్కులో కొలువులివ్వండి..

తమ సంక్షేమానికి కేంద్రం ఏర్పాటు చేసిన మిల్లులు మూతబడ్డాయని, కేటాయించిన 502 ఎకరాల్లో 250 ఎకరాలైనా తమ కుటుంబాలకు కేటాయించాలని అంతర్గాంలో ఉన్న కాందిశీకులు కోరుతున్నారు. వాస్తవానికి 2009 సెప్టెంబర్ 1న ఇళ్ల స్థలాల విషయమై అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని వీరు కలిశారు. దీంతో వెంటనే అందరికీ పట్టాలు ఇవ్వాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. కానీ ఆ మరునాడే వైఎస్ హెలీకాప్టర్ ప్రమాదంలో మరణించడంతో, ఇప్పటివరకు వీరి గోడు పట్టించుకున్న నాథుడే లేకుండా పోయాడు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల దాదాపు 100 ఎకరాలు ఇండస్ట్రియల్ పార్కు కోసం ప్రకటించింది. ఈ నేపథ్యంలో తమకు కేటాయించిన భూములు కబ్జాలకు గురవుతున్నాయని, తొలుత తమకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి కుటుంబానికి పదిగుంటల నివాస స్థలం ఇచ్చాకే, పరిశ్రమలు స్థాపించాలని శరణార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడ స్థాపించబోయే పరిశ్రమల్లో ఉద్యోగాల కల్పనలో బర్మా, శ్రీలంక శరణార్థుల కుటుంబాలకే తొలి ప్రాధాన్యం కల్పించాలని కోరుతున్నారు. మరోవైపు అప్పట్లో పునరావాసం కోసం ఏర్పాటు చేసిన క్వార్టర్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటికి మరమ్మతు చేసుకుందామంటే స్థానిక అధికారులు అంగీకరించడం లేదు. కనీసం ఉన్న గూడుకు మరమ్మతులు చేసుకునే అవకాశం కల్పిస్తే..శరణార్థుల కుటుంబాలు తలదాచుకునేందుకు అవకాశం ఉంటుందని శ్రీలంక, బర్మా శరణార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి జమ్ముల రామారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



'మార్గదర్శి'లాంటి స్కాం ఇప్పటివరకు జరగలేదు

- మార్గదర్శి అక్రమ మార్గాల్లో తరలించిన సొమ్మంతా ఖాతాదారులదే
- విచారణ వివరాలు తెలుసుకునే హక్కు వారికి ఉంది
- తెలంగాణ హైకోర్టుకు తెలిపిన ఏపీ ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లాంటి కుంభకోణం ఇప్పటివరకు జరగలేదు, ఇకపై జరగబోదని ఏపీ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టుకు తెలిపింది. 'మార్గదర్శి'కి సంబంధించిన కేసులపై సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉందని వెల్లడించింది. మార్గదర్శి కేసు దర్యాప్తు వివరాలను సీఐడీ అధికారులు మీడియాకు వెల్లడిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని కోరుతూ చెరుకూరి రామోజీరావు, శైలజ, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రై. లిమిటెడ్ తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి వాదనలు వినిపించారు. మార్గదర్శి అక్రమ మార్గాల్లో తరలించిన సొమ్మంతా ఖాతాదారులదేనని చెప్పారు. ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం విచారణ వివరాలు తెలుసుకునే ప్రాథమిక హక్కు వారికి ఉందన్నారు. ఈ రకమైన ఓ కుంభకోణం జరగడం ఇదే తొలిసారిని చెప్పారు. ఇదే విజ్ఞప్తిపై గతంలోనూ ఇదే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని, అప్పుడు పిటిషనర్‌కు అనుకూలంగా ఎలాంటి ఉపశమన ఆదేశాలు ఇవ్వలేదని గుర్తుచేశారు. ఈ పిటిషన్‌ను కూడా కొట్టివేయాలని కోరారు. అసలు మార్గదర్శి వేసిన పలు పిటిషన్లపై విచారణ జరిపే అర్హత ఈ కోర్టుకు ఉందా అన్న అంశంపై విచారణ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని చెప్పారు. ఈ పిటిషన్ జూలై 18న విచారణకు రానుందని, అప్పటివరకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ విచారణను జూలై 20కి వాయిదా వేసింది.

ఐటీ ఎగుమతుల్లో బూమ్

ఏపీలో నాలుగేళ్లలో 34 శాతం పెరిగిన ఎగుమతులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఐటీ ఎగుమతులు గత నాలుగేళ్లుగా వేగంగా విస్తరిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో పలు ఐటీ కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభిస్తుండటంతో ఐటీ ఎగుమతుల్లో గణనీయమైన వృద్ధి నమోదవుతోంది. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ), వీసెజ్‌ల్లో నమోదైన ఐటీ కంపెనీల ద్వారా 2022–23లో రాష్ట్రంలో రూ.1,649.25 కోట్ల విలువైన ఐటీ ఎగుమతులు జరిగినట్లు ఐటీ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. ఇందులో ఎస్‌టీపీఐలో నమోదైన ఐటీ కంపెనీల ద్వారా రూ.972.43 కోట్ల ఎగుమతులు జరగగా వీసెజ్ కంపెనీల ద్వారా రూ.676.82 కోట్ల ఎగుమతులు జరిగాయి.

రూ.5,000 కోట్లపైనే!

2019–20లో ఏపీ నుంచి రూ.1,087.4 కోట్ల ఐటీ ఎగుమతులు నమోదు కాగా నాలుగేళ్లలో 34% పెరిగాయి. నాలుగేళ్లలో ఎస్‌టీపీఐ కంపెనీల ద్వారా ఎగుమతులు రూ.846.77 కోట్ల నుంచి రూ.972.43 కోట్లకు పెరిగితే వీసెజ్ ద్వారా ఎగుమతులు రూ.240.63 కోట్ల నుంచి 676.82 కోట్లకు చేరుకున్నాయి. ఇంకా పలు ఐటీ కంపెనీల ఆడిటింగ్ పూర్తికాలేదని, ప్రాథమిక సమాచారం మేరకు 2022–23 ఐటీ ఎగుమతుల అంచనాలను రూపొందించినట్లు ఐటీ శాఖ అధికారులు వెల్లడించారు. రాష్ట్రం నుంచి భారీగా ఎగుమతులు జరుగుతున్నా వాటి ప్రధాన కార్యాలయాలు ఇక్కడ లేకపోవడంతో రాష్ట్ర పరిధిలోకి రావడం లేదని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటాప్) ప్రెసిడెంట్ శ్రీధర్ కోసరాజు పేర్కొన్నారు.

ఆర్నెల్లలో వరుసగా..

ప్రభుత్వ ప్రోత్సాహంతో పలు ఐటీ కంపెనీలు విశాఖతోపాటు పలు ద్వితీయ శ్రేణి పట్టణాల్లో తమ కార్యాలయాలను ప్రారంభిస్తున్నాయి. 2019కి ముందు రాష్ట్రంలో ఐటీ కంపెనీల సంఖ్య 178 కాగా ఇప్పుడు 372కి చేరుకోవడం గమనార్హం. కొత్తగా ఏర్పాటైన కంపెనీల ద్వారా అదనంగా 20,000కి పైగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు 'అపిటా' గ్రూపు సీఈవో ఎస్.కిరణ్ కుమార్‌రెడ్డి చెప్పారు.

టీడీపీతో పొత్తు పెట్టుకోం: సోము వీర్రాజు

చిల్లకూరు(తిరుపతి జిల్లా)/చిత్తూరు కార్పొరేషన్: రానున్న ఎన్నికల్లో అందరూ అనుకున్నట్లు టీడీపీతో పొత్తు పెట్టుకునేది లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని పారిచెర్లవారిపాళెంలో సోమవారం కేంద్ర ఐటీ సహాయ మంత్రి దేవూసిన్హ్ చౌహాన్‌తో కలసి ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం పొత్తులతో అధికారంలోకి రాదని, అందుకే రాష్ట్రంలో టీడీపీతో ఎలాంటి పరిస్థితుల్లో పొత్తు పెట్టుకోకూడదని అనుకుంటున్నట్లు తెలిపారు. అయి తే జనసేనతో మాత్రం కలసి నడుస్తామన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా వద్దు ప్యాకేజీ చాలని చంద్రబాబు కేంద్రాన్ని కోరారని సోమువీర్రాజు స్పష్టం చేశారు. చంద్రబాబు అమరావతిలో తాత్కాలిక రాజధాని నిర్మించారని ఆరోపించారు. బాబు పాలనలో సోమవారం పోలవరం అని కాలక్షేపం చేశారన్నారు.

జిల్లా వార్తలు

వంద శాతం హాజరు నమోదు కావాలి



హెచ్‌ఎంల సమావేశంలో సూచనలు చేస్తున్న డేవిడ్‌రాజ్

భద్రాచలం: గిరిజన విద్యాసంస్థల్లో విద్యార్థుల హాజరు వంద శాతం నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఏపీఓ, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ హెచ్‌ఎంలకు సూచించారు. హైదరాబాద్ నుంచి ఆన్‌లైన్ సమావేశం ద్వారా రాష్ట్ర గురుకులాల ప్రిన్సిపల్ సెక్రటరీ రోనాల్డ్‌రోస్ అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సమావేశం అనంతరం డేవిడ్‌రాజ్ హెచ్‌ఎంలతో సమీక్షించారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి వంద హాజరయ్యేలా చూడాలని, పాఠ్య, నోట్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్ పంపిణీ చేయాలని తెలిపారు. ప్రతీ విద్యాసంస్థలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. వర్షాకాలం ప్రారంభమైనందున తాగునీరు, పారిశుద్ధ్యం విషయంలో శ్రద్ధ వహిస్తూ అవసరమైన మందులు సమకూర్చుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ నర్సింహారావు, జీసీడీఓ అలివేలు మంగతాయారు, హెచ్‌ఎంలు, వార్డెన్లు పాల్గొన్నారు.

సివిల్స్ లాంగ్ టర్మ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ (ప్రిలిమ్స్, మెయిన్స్) ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.శ్రీలత తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వర్గాల్లో డిగ్రీ పాసై 31ఏళ్ల లోపు వయసుకలిగిన అభ్యర్థులు ఈ శిక్షణకు జూలై 7వ తేదీ లోగా స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు జూలై 16న ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తామని తెలిపారు. అయితే, వంద మంది అభ్యర్థులను ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా, 50 మందిని నేరుగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ సమయంలో భోజన, వసతి, రవాణా కోసం నెలకు రూ.5 వేలతో పాటు రూ.5 వేల విలువైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు. గతంలో ప్రిలిమ్స్ ఉత్తీర్ణులైన అభ్యర్థులను నేరుగా ఎంపిక చేస్తామని, వివరాల కోసం 08742-227427, 95738 59598 నంబర్లలో సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

'జల విద్యుత్'కు గ్రీన్ సిగ్నల్ వచ్చేనా ?

- సీతమ్మ సాగర్ బ్యారేజీని సందర్శించిన జెన్‌కో సీఎండీ
- రాష్ట్రంలోనే కీలకం కానున్న జల విద్యుత్ కేంద్రం





సీతమ్మ సాగర్ బ్యారేజీ వద్ద అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ ప్రభాకర్‌రావు (ఇన్‌సెట్) బీటీపీఎస్‌లో మొక్క నాటుతున్న జెన్‌కో సీఎండీ

అశ్వాపురం: అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ బ్యారేజీని జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు సోమవారం సందర్శించారు. జలవనరుల శాఖ అధికారులు మ్యాప్ ద్వారా బ్యారేజీ నిర్మాణ వివరాలను ఆయనకు తెలియజేశారు. సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్ బ్యారేజీకి అనుబంధంగా 280 మెగావాట్ల జల విద్యుత్ కేంద్రం నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే బ్యారేజీ పనులు పిల్లర్ల వరకు పూర్తయినా జల విద్యుత్ కేంద్రం నిర్మాణంపై ఇంత వరకూ గ్రీన్ సిగ్నల్ రాలేదు. కాగా, సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకే జెన్‌కో సీఎండీ సీతమ్మ సాగర్ బ్యారేజీని సందర్శించారని సమాచారం.

రాష్ట్రంలోనే కీలకం..

సీతమ్మ సాగర్ బ్యారేజీ వద్ద నిర్మించనున్న 280 మెగావాట్ల జల విద్యుత్ కేంద్రం రాష్ట్రంలోనే కీలకంగా మారనుంది. సీతమ్మ సాగర్ జల విద్యుత్ కేంద్రంలో ఏడు బల్బ్ టర్బైన్ల యూనిట్లు ఉంటాయి. ఒక్కో యూనిట్ ద్వారా 40 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగనుంది. ఈ కేంద్రం నుంచి ఏడాదికి సుమారు 1016.88 మెగా యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని అంచనా. రాష్ట్రంలో ఇప్పటి వరకు జల విద్యుత్ కేంద్రాలన్నీ కృష్ణా నదిపైనే ఉన్నాయి. వీటి సామర్థ్యం 2,369 మెగావాట్లు. గోదావరిపై పోచంపాడు వద్ద 36 మెగావాట్లు, నిజాంసాగర్ వద్ద 10 మెగావాట్లు, సింగూరు వద్ద 15 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ కేంద్రాలు ఉన్నాయి. సీతమ్మ సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి నదిపై 280 మెగావాట్ల సామర్థ్యం గల జల విద్యుత్ కేంద్రం నిర్మిస్తే ఇదే కీలకం కానుంది.

బీటీపీఎస్‌ను సందర్శించిన సీఎండీ

మణుగూరు రూరల్ : జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు సోమవారం మణుగూరులోని బీటీపీఎస్‌ను సందర్శించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా బీటీపీఎస్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు, జీవకోటి మనుగడకు మొక్కలే ఆధారమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ చర్యలను చేపట్టాలన్నారు. అనంతరం బీటీపీఎస్ రైల్వేలైన్ నిర్మాణ పనులు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో జెన్‌కో డైరెక్టర్లు టీఆర్‌కే.రావు, ఎం.సచ్చిదానందం, వెంకటరాజం, అజయ్, లక్ష్మయ్య, విద్యుత్ సౌధ సీఈ రత్నాకర్, బీటీపీఎస్ సీఈ బిచ్చన్న, జలవనరుల శాఖ ఎస్ఈ వెంకటేశ్వరరెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈ రాంబాబు, ఏఈ నవీన్, విజిలెన్స్ అధికారులు వినోద్‌కుమార్, ముత్యంరెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు రాంప్రసాద్, పార్వతి, రమేష్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీఓ



గిరిజన దర్బార్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీఓ గౌతమ్

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా ఇప్పటి నుంచే ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరించి యూనిట్ అధికారులకు అందచేశారు. అనంతరం పీఓ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, విద్యాసంస్థల్లో పరిశుభ్రతా చర్యలు చేపట్టడమే కాక అవసరమైన మందులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అలాగే, తొలి నుంచే మెరుగైన బోధన అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని తెలిపారు. ఇక అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, జీసీసీ డీఎం విజయ్‌కుమార్, అధికారులు తానాజీ, రమణయ్య, సురేష్‌బాబు, భాస్కరన్, మునీర్‌పాషా, శ్రీనివాస్, ప్రభాకర్‌రావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీట్ లాంగ్ టర్మ్ శిక్షణకు దరఖాస్తులు

షెడ్యూల్డ్ తెగల బాలబాలికలకు నీట్ లాంగ్ టర్మ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీఓ గౌతమ్ తెలిపారు. హైదరాబాద్‌లో ఇచ్చే ఉచిత శిక్షణకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై నీట్–2024 రాసిన గిరిజన బాలురు, బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ప్రభుత్వ గురుకులం వెబ్‌సైట్ ద్వారా రూ.200చెల్లించి జూలై 3లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'నైటింగేల్'కు కలెక్టర్ సన్మానం



సుశీలను సన్మానిస్తున్న కలెక్టర్ అనుదీప్, అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/కొత్తగూడెం అర్బన్: ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్న మహిళా ఆరోగ్య కార్యకర్త తేజావత్ సుశీలను కలెక్టర్ అనుదీప్ సోమవారం కలెక్టరేట్‌లో సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఎర్రగుంట పీహెచ్‌సీకి చెందిన సుశీల జాతీయ స్థాయి అవార్డు స్వీకరించడం రాష్ట్రానికి, జిల్లాకు గర్వకారణమన్నారు. ఆమె స్ఫూర్తితో వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ మరిన్ని అవార్డులను సాధించాలని ఆకాంక్షించారు. ఆ తర్వాత డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష ఆధ్వర్యాన కూడా సుశీలను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజ్‌కుమార్‌తో పాటు అధికారులు డాక్టర్ మణికంఠారెడ్డి, డాక్టర్ సుందర్, డాక్టర్ ప్రియాంక, ఫయాజ్ మొయినుద్దీన్, నాగలక్ష్మి, పూలమ్మ, మోహన్, అన్నామేరీ, విజయ్‌కుమార్, బేబీ, నాగేశ్వరరావు, శారారాణి పాల్గొన్నారు.

అంబేద్కర్, జగ్జీవన్‌రాంను స్ఫూర్తిగా తీసుకోవాలి

విగ్రహాల ఆవిష్కరణలో ఎమ్మెల్యే సండ్ర, మంద కృష్ణ



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య, మంద కృష్ణ

తల్లాడ: బీఆర్.అంబేద్కర్, జగ్జీవన్‌రాం వంటి మహనీయులను అందరూ ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి పాటుపడాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ సూచించారు. తల్లాడ మండలం తెలగవరంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్, జగ్జీవన్ రామ్‌ల విగ్రహాలను సోమవారం ఆయన సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రచించి దేశానికి మార్గనిర్దేశం చేసిన అంబేద్కర్ కలల సాకారానికి అందరూ కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంకటవీరయ్య మాట్లాడుతూ అంబేద్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలను ఏర్పాటుచేసిన యువతను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, ఎంపీఓ కె.శ్రీదేవి, సర్పంచ్ తేళ్లూరి కృష్ణయ్యతో పాటు మువ్వా మురళీధర్‌రావు, కేతినేని చలపతిరావు, అశోక్ పాల్గొన్నారు.

కొండరెడ్లకు ఉపాధి కల్పిస్తాం

నాబార్డ్ డీడీఎం సుజిత్ కుమార్



వెదురు ఉత్పత్తులను పరిశీలిస్తున్న నాబార్డ్ డీడీఎం సుజిత్‌కుమార్

అశ్వారావుపేటరూరల్: కొండరెడ్ల జీవనోపాధి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని నాబార్డ్ డీడీఎం సుజీత్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై దత్తత గ్రామాలైన కొండరెడ్ల గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ముందుగా అశ్వారావుపేట మండలం గోగులపూడి, శ్రీ గుబ్బల మంగమ్మ ఆలయం, దమ్మపేట మండలం పూచుకుంటల్లో పర్యటించి కొండరెడ్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గోగులపూడి గ్రామస్తులు మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా వెదురు ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చారని చెప్పగా మార్కెటింగ్‌పై ఆరా తీశారు. అలాగే, కోళ్లు, తేనెటీగల పెంపకం, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్ రంగాల్లో శిక్షణ ఇస్తామని, చిరు ధాన్యాల పంటలను సాగు చేస్తే ఉత్పత్తుల తయరీకి మిషనరీ సమకూరుస్తామని సుజిత్ తెలిపారు. అనంతరం గుబ్బల మంగమ్మ ఆలయంలో వద్ద కొండరెడ్ల దుకాణాలను పరిశీలించి వ్యాపార వివరాలు తెలుసుకున్నారు. భద్రాచలం రెడ్‌క్రాస్ సొసైటీ ఇన్‌చార్జి రవికుమార్, కొండరెడ్లు బాబురెడ్డి, దుర్గారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.